# నృపాల పూజితము

"నాన్నా! రామూని రెసిడెన్షియల్ కాలేజీలోనే చేర్పించండి... బాగుంటుంది" కాఫీ కప్పు నా చేతికి ఇస్తూ అన్నది మా పెద్దమ్మాయి శారద.

వేసవి సెలవలకు పిల్లలిద్దర్నీ తీసుకుని మా ఇంటికి వచ్చిందామె. మరో వారం రోజుల్లో అల్లుడు వచ్చి వాళ్లను తీసుకువెళ్తాడు.

"ఏమ్మా... తమ్ముడు, నిన్ను రికమండేషన్ చేయమన్నాడా" నవ్వుతూ అన్నా.

"అనికాదుకానీ...వాడు..."

"ఎందుకమ్మా అవన్నీ...మేమందరం రెసిడెన్షియల్ కాలేజీల్లో చదివే, డిగ్రీ సంపాయించామా... మీ పిచ్చిగానీ" అన్నాను.

"అందరికీ మీకు జరిగినట్టే జరగాలా ఏం? అయినా మీ కాలంలో రెసిడెన్షియల్ కాలేజీలు ఎక్కడున్నాయ్" ఉక్రోషంగా అని చరచరా వంటగదివైపు నడిచాడు రాము.

"అక్కడయితే పిల్లలకు చదువు బాగా వస్తుందటగా నాన్నా. బాగా చెప్తారట. శ్రద్ధగా చదివిస్తారటకూడ కదా" అడిగింది శారద.

"అంతా నాటకం అమ్మా. మీకు తెలీదు. డబ్బెలా ఖర్చు చేయాలో అంతుపట్టక అవస్థపడే ఆస్తిపరులగ్గానీ, మనలాంటి మధ్యతరగతి వాళ్ళకొక్కాదమ్మా ఆ రెసిడెన్షియల్ స్కూల్స్. కాలేజీలూనూ. అవసలు స్కూళ్లలా వుండవ్. ఫైవ్‌స్టార్ హోటళ్లలా వుంటయ్"

"వాడు ఎక్కడ చదువుకుంటానంటే అక్కడ చదివించక ఏమిటండీ ఈ రాద్ధాంతం. అన్నీ మీ రోజుల్లోలాగానే జరగాలంటే ఎలా?" కొడుకు పక్షాన పలికింది నా భార్య.

ఆమె వెనకాలే ముఖం ముడుచుకుని వంట గది వాకిట్లో నిలబడ్డాడు రాము.

"... జూనియర్ కాలేజీలో అప్లికేషన్ ఫారం తెచ్చాను. పూర్తిచేసి పంపితే తప్పకుండా మన వాడికి సీటు ఇస్తానన్నారు ప్రిన్సిపాల్‌గారు" అందర్నీ ఉద్దేశించి చెప్పేను.

వాళ్ల అమ్మను కొంచెం ముందుకు నెట్టి, కాళ్లు నేలకేసి కొట్టుకుంటూ విసురుగా బయటకు వెళ్లాడు రాము.

అప్పటికి ఆ ప్రసక్తిని ఆపి ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు. మనసంతా చికాగ్గా తయారైంది నాకు.

మా చిన్నవాడు పదో తరగతి పాస్‌కావటం మా ఇంట్లో ఓ అలజడి సృష్టించింది. గత వారం రోజులుగా వాగ్వివాదాల్తోనే రోజులు గడిచి పోతున్నై. కుటుంబసభ్యులందరిదీ ఒక మాటయితే, నా ఒక్కడిదీ ఒక మాటయింది.

వాళ్లందర్నీ ఎలా సమాధానపరచాలో తోచక సతమతమైపోతున్నాను. ముఖ్యంగా రాముని ఒప్పించటం కష్టంగా వుంది.

మర్నాడు మా బావమరిది వచ్చాడు.

"ఏం బావగారూ... రామూని ఏ కాలేజీలో చేర్పించాలనుకుంటున్నారు?" అడిగాడాయన.

ఆ ప్రస్తావనంటేనే అయిష్టంగా వున్నది నాకు.

"జూనియర్ కాలేజీలో" చెప్పేను ముక్తసరిగా.

"మీరింకా మీ కాలంలోనే వున్నట్లున్నారు బావగారూ. ఇప్పుడంతా రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలంటూ తపించిపోతుంటే మీరేంటండీ బాబూ" అంటూ ముద్ద నోట్లో పెట్టుకున్నాడు.

"అసలు పిల్లలు చెడిపోవటానికి పెద్దలే కారణం. వాళ్లు తెలిసీ తెలీకుండా ఏవేవో అర్థంలేని ఆలోచనలు చేస్తే వాళ్లకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించాల్సిందిపోయి, పెద్దవాళ్లే తప్పుగా ఆలోచిస్తున్నారు" కాస్తంత ఆవేశంగా అన్నాను నేను.

"అదికాదు బావగారూ... ఇప్పుడు పిల్లలంతా..." అంటూ ఏదో చెప్పబోయిన అతని మాటల్ని మధ్యలోనే ఆపేస్తూ...

"నువ్వేం చెప్పకు మురళీ. పిల్లల్ని అలాంటి ఖరీదయినచోట చేర్పించి చదివించే తాహతు వున్నవాడ్ని కాదు నేను. అయినా ఆ రెసిడెన్షియల్ కాలేజీల మీద నాకు సదభిప్రాయమూ లేదు, మోజూ లేదు... నీకో విషయం చెప్పనా

నేను డిగ్రీ చదువుకున్న కాలేజీలో పూరి పాకల్లో... అయినా నేనేం కించబడలేదు. మనకి కావలసింది చదువు... అంతే"

"మీరు చదివింది పూరిపాకల్లోనే కావచ్చు. వానలొస్తే బడికి సెలవలిచ్చే రోజులవి. అందుకే వానాకాలం చదువులనేవారు మీ రోజుల్లో" అని నవ్వేడు మురళి.

"చాల్లేవయ్యా. చూస్తున్నాంగా మీ ఎండాకాలం చదువులు. పది సంవత్సరాలు కూడా నిండని పసివాళ్లక్కూడా సమ్మర్ కోచింగ్‌లంటూ ప్రాణాలు తీస్తున్నారు. మాకాలంలో వేసవి సెలవలంటే విద్యార్థులకు ఎంత ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆటవిడుపుగా వుండేది. ఎండాకాలం సెలవలు వస్తున్నాయంటే తాతగారి ఊరికో, తంజావూరు చూడ్డానికో వెళ్లేవాళ్లం.

అసలిప్పుడు బాల్యం, బాల్యంలోని తీయదనం అనుభవించనిస్తున్నారటయ్యా పిల్లల్ని. వాళ్లకి ఆడుకునే తీరికుండనిస్తున్నారా? నిద్ర లేస్తుండగానే ఆటోవాడి పిలుపు మేలుకొలుపు. హడావిడిగా నాలుగు చెంబుల నీళ్లు కుమ్మరించుకోవటం, మూడు ముద్దలు ముక్కున, నోట్న కొట్టుకుని మరో మూడు ముద్దలు క్యారేజీలోకి సర్దించుకుని మోయలేని బరువుని వీపుమీద వేసుకుని వెళ్తారు.

ఇక సాయంత్రానికి వాడిపోయిన ముఖాల్తో అలసి సొలసి, ఆటోవాలా తిప్పిన వీధులన్నీ తిరిగి తిరిగి ఇంటికి చేరుకుంటున్నారు. ఇంటికి వచ్చింది మొదలు కళ్లు మూతలు పడేవరకూ హోంవర్క్ చేసుకోవడం, వీలయితే టీ.వీ. ముందు కూర్చోవడం తప్ప పిల్లలకేం మిగులుస్తున్నారు చెప్పు ఆవేశంగా అన్నాన్నేను.

"మీరిలాగే మాట్లాడుతుండండీ... వాడసలు చదువుకోనంటున్నాడు" గదిలోకి వస్తూనే చిరుకోపంగా అన్నది శారద.

"లక్షణంగా మానేయమను. నాకేం అభ్యంతరం లేదు. లక్ష్మణరావు కిరాణా కొట్లో పొట్లాలు కట్టే ఉద్యోగం ఇప్పిస్తాను. నేర్చుకోమను బాగుపడతాడు" అన్నాను నిర్లక్ష్యంగా.

"బానేవుందిలేండి మీ వరస. ఊరంతా వాడ్ని రేంక్ వచ్చినందుకు పొగుడుతూవుంటే పొట్లాలు కట్టుకు బతకమంటున్నారు మీరు. ఈ మాటలు వింటే వాడికెలా వుంటుంది?" అన్నది నా భార్య.

"మీరందరూ అతితెలివితేటలు ప్రదర్శించకుండా నోరు మూసుకుని కూర్చుంటే వాడి కెలా చెప్పి ఒప్పించాలో నాకు తెలుసు. మీరంతా కాస్త ఓపిక పట్టండి" హెచ్చరింపుగా అన్నాను.

"మామయ్యగారూ, మామయ్యగారూ! మరీ రామూలేడూ...మరీ...మా బామ్మకు బస్టాండ్‌లో కన్పించాడట. ఆఁ...ఏమిట్రా ఇక్కడున్నావని అడిగితే...ఆఁ... ఇంట్లోంచి వెళ్లిపోతున్నా అన్నాడట... బామ్మ మీకు తొందరగా చెప్పి రమ్మంది" రొప్పుతూ చెప్పేడు పరుగెత్తుకుంటూ వచ్చిన పక్కింటి వాళ్లబ్బాయి.

ఇంట్లో అందరి ముఖాలు వివర్ణమయినాయి. నా భార్య అప్పుడే కళ్లొత్తుకుంటూ రాగాలు తీస్తూ లోనికి నడిచింది. పరిస్థితి చేయిదాటి పోతున్నదనిపించింది నాకు. ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా మురళిని వెంట పెట్టుకుని బస్టాండ్ బయల్దేరేను.

బస్టాండ్ అంతా వెతికాం. రాము కన్పించకపోవడంతో నాకు ఆందోళన ప్రారంభమయింది.

"ఏం సార్ మీ వాడ్ని బస్ ఎక్కించటానికి వచ్చారా?" పక్కింటి మాష్టారు అడిగారు.

ఇక దాచి పెట్టి ప్రయోజనం వుండదనుకుని క్లుప్తంగా విషయం చెప్పేశాను ఆయనకు.

"అరెరె. అలాగా. మీవాడు ఇప్పుడే పొన్నూరు వెళ్లే బస్ ఎక్కేడు. నే చూశాను" అన్నాడాయన.

ఆ మాట వినగానే నాకు కొంత ధైర్యం వచ్చింది. పొన్నూరు రామువాళ్ల అమ్మమ్మగారి ఊరు. వాళ్లింటికే వెళ్లివుంటాడని నా నమ్మకం. అందుకే ధైర్యం.

మురళిని పొన్నూరు వెళ్లి రామును తీసుకురమ్మని చెప్పేను.

మాష్టార్తో కలిసి ఇంటిదారి పట్టేన్నేను.

* * * *

"ఏమిటో మాష్టారు.. ఈ కాలం చదువులేమిటో అర్థంకాకుండా వుంది" ఆవేదనగా అన్నాను.

"ఎవ్వరం చేయగలిగింది ఏమీ లేదండీ. గాలి ఎటు వీస్తుంటే అటుగా ప్రయాణించడమే మేలు" అన్నారాయన నవ్వుతూ.

"పదవ తరగతి పాసయినవాడ్ని ఇంటర్‌లో చేర్పించటానికి ఆరువేల రూపాయలు ఫీజంటే మాటలా మాష్టారూ... మధ్యతరగతి వాళ్లకది సాధ్యమేనా చెప్పండి... అవునుగాని అసలీ రెసిడెన్షియల్ కాలేజీల సంగతి కాస్త చెప్తారూ" అనునయంగా అడిగాను.

"ఏం లేద్సార్. అంతా నాటకం, దోపిడీ. బయట కాలేజీల్లో వర్క్‌చేసే సీనియర్ లెక్చరర్స్‌నే వీళ్లు కాంట్రాక్ట్ పద్ధతిమీద కుదుర్చుకుంటారు. ఇవ్వాల, రేపు మేథ్స్, సైన్స్ చెప్పగలిగినవాళ్లకి మంచి డిమాండ్ వుంది.

మేథ్స్ వాళ్లకి ఒక్కో బ్యాచ్‌కి లక్షరూపాయలదాకా ఇస్తున్నారు. రెసిడెన్షియల్ వాళ్ళు. అదే సైన్స్ వారికి అరలక్ష. ఇక వారు ఆ జూనియర్ కాలేజిల్లోనూ, స్కూల్స్‌లోనూ పాఠాలేం చెప్తారు. అక్కడ సెలవలు పెట్టి ఇక్కడ కాలక్షేపం చేసి లక్షలు పోసేసుకోవటానికి అలవాటుపడ్డారు... అంతే" అన్నారాయన.

"వారి సంపాదన సంగతి సరే. ఇక్కడయినా పిల్లలకి చదువు సక్రమంగా చెప్తారంటారా"

"చదువు చెప్పాల్సిన అవసరం ఎక్కడుందంటారు. పరీక్షలకోసం చదువులు. పరీక్షలు రాయించటానికి పుస్తకాలు తెరచి ఇచ్చి కాపలా వుండి కాపీలు రాయించడానికే మన దగ్గర అంతేసి సొమ్ము వసూలు చేయడం" అని నవ్వేడాయన.

మాట్లాడుకుంటూనే ఎవరి గూటికి వాళ్లం చేరేం. ఆయన చెప్పిన విషయాలు నా నిర్ణయాన్ని మరింత బలపరిచినై. ఎలాగైనా రాముని నేననుకున్న జూనియర్ కాలేజీలోనే చేర్పించాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

ఇంట్లోకి వెళ్లి శారదని, వాళ్ల అమ్మని పిలిచి మాష్టారు చెప్పిన మాటలన్నీ చెప్పి వాళ్ళకి ఓ అవగాహన కల్పించాను.

వాళ్ళూ కొంత ఆలోచనలో పడ్డారు. ఎలాగో రాముకి నచ్చచెప్పమని వాళ్ళిద్దరికీ కూడా ఆ బాధ్యత అప్పగించాను.

రాత్రి ఏడుగంటలవుతుండగా రాము, మురళి వచ్చారు. రాత్రి చాలా పొద్దుపోయేవరకు, శారద, నా భార్య కూడా రాముతో ఏవేవో చెప్పడం గమనిస్తూనే నిద్రలోకి జారుకున్నాను.

* * * *

రాము జూనియర్ కాలేజీలో చేరడానికి నా కంటే వాళ్ల అమ్మ, అక్కయ్యల పాత్ర ఎక్కువ. ఎలాగయితేనేం వాడ్ని ఒప్పించగలిగినందుకు సంతోషపడ్డాన్నేను.

వాడిలో ఏ మూలనో వున్న నిరాశను పోగొట్టేందుకు కొత్తసైకిల్ కొనిచ్చాను. సంతోషపడిపోయాడు వాడు.

మొదటిసారిగా కొత్త సైకిల్‌మీద కొత్తగా కాలేజీకి వెళ్లాడు రాము.

శారదను, పిల్లల్ని తీసుకువెళ్లేందుకు అల్లుడు వచ్చాడు. వాళ్లని రైలు ఎక్కించి ఇంటికి తిరిగి వచ్చాను. కాసేపటికే రాము కాలేజీనుంచి తిరిగి వచ్చాడు. వస్తూనే చేతిలో వున్న నోట్‌బుక్ బల్లమీదకు విసిరేశాడు.

"ఎంతగా అడిగినా కాదన్నారు. ఇప్పుడు చూడండి. ఈ కాలేజీలో లెక్చరర్స్ ఏం చెప్తున్నారో ఎలా చెప్తున్నారో" అన్నాడు రాము.

"మొదటి రోజునే పాఠాలేం చెప్తార్లే నాన్నా" అనునయంగా అన్నాన్నేను.

"పాఠాలు చెప్పకపోతే ఫరవాలేదు. మీరందరూ ఫలానా రెసిడెన్షియల్ కాలేజీలో చేరండి. అక్కడయితే పాస్ కాదు క్లాస్ గ్యారెంటీ. ఇక్కడ మీకు క్లాసులు సరిగా జరగవ్. పోర్షన్ పూర్తికాదు. మేం సెలవలు పెడుతుంటాం.... ఆ తర్వాత మీ ఇష్టం అని చెప్పేరు తెల్సా"

ఆశ్చర్యపోయాన్నేను.

"నిజంగా ఇలాగే చెప్పేరుట్రా రామూ" అడిగాను విస్మయంగా.

"నిజంగా... ఇవే మాటలు చెప్పేరు" ఉక్రోషంగా అన్నాడు వాడు. ఆ నిజాన్ని జీర్ణించుకోలేకపోయాను.

అందరికీ అందుబాటులో విద్య అని నినాదాలిచ్చే ప్రభుత్వంగానీ హక్కులకోసం పోరాడేందుకు ఏర్పడిన విద్యార్థి సంఘాలుగానీ ఈ విషయంపై ఎందుకు దృష్టి సారించరోనన్న అనుమానం పీడించసాగింది నన్ను.

రాముకు ఏం సమాధానం చెప్పాలో తెలియక సిగ్గుతో తల వంచుకున్నాన్నేను.

'విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము, యశస్సు, భోగకరి, గురుండు, విదేశబంధుడు, విశిష్టదైవతము, నృపాల పూజితము...' అన్న భర్తృహరి సుభాషితం గుర్తుకువచ్చి విరక్తిగా నవ్వుకున్నాను.

* * * *

◆ స్వాతి ◆